1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

సంపుటి : 2 సంచిక : 195 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 09 జూన్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 195 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 09 June 2025 PAGES : 8 PRICE : 3/-

## బండారు దత్తాత్రేయ 'ప్రజల కథే నా ఆత్మకథ'

### పుస్తకావిష్కరణకు హాజరైన సీఎం చంద్రబాబు...

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ 'ప్రజల కథే నా ఆత్మకథ' ఆవిష్కరణ
- కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- దత్తాత్రేయ నిబద్ధత, సేవా దృక్పథాన్ని కొనియాడిన సీఎం చంద్రబాబు
- యువతకు దత్తాత్రేయ జీవితం స్ఫూర్తిదాయకమని వెల్లడి




(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 08)

సామాన్యుడిగా మొదలై ఉన్నత శిఖరాలకు చేరిన ప్రస్థానమే ఈ పుస్తకం అన్న దత్తాత్రేయ హర్యానా గవర్నర్, సీనియర్ రాజకీయవేత్త బండారు దత్తాత్రేయ రచించిన 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమం నేడు హైదరాబాదులో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. దశాబ్దాల ప్రజాజీవితంలో దత్తాత్రేయ సాధించిన విజయాలు, ఆయన వ్యక్తిగత మైలురాళ్లు, సామాజిక సేవ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ఈ పుస్తకం కళ్లకు కడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నేతలు చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. కాంగ్రెస్ మంత్రులు కూడా చంద్రబాబుతో ఉత్సాహంగా మాట్లాడుతూ కనిపించారు.బండారు దత్తాత్రేయ ఆత్మకథ 'ప్రజల కథే నా ఆత్మకథ' తెలుగు ప్రతిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, దత్తాత్రేయ నిబద్ధత, నిరాడంబరత, ప్రజా సంక్షేమం పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ పుస్తకం భావి తరాల నాయకులకు మార్గదర్శకంగా నిలుస్తుందని, ఆయన జీవితంలోని -మిగతా 2లో

## పాక్‌లో ఉగ్రవాదాన్ని పోత్సహిస్తే ప్రమోషన్లు.. లేదంటే బేడీలు: శశిథరూర్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 08)

ప్రపంచంలోనే కరుడుగట్టిన ఉగ్రవాది, అల్‌ఖైదా అగ్రనేత ఒసామా బిన్‌లాడెన్ ను పట్టించడంలో సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ)కి సాయం చేసిన డాక్టర్ షకీల్ అఫ్రీదీపై పాకిస్థాన్ కఠిన చర్యలు తీసుకోవడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. షకీల్ అఫ్రీదిని విడుదల చేయాలంటూ అమెరికా చట్టసభ సభ్యుడు బ్రాడ్ షెర్మన్ చేసిన డిమాండ్ సరియైనదేనన్నారు. షకీల్ అఫ్రిదీని




విడుదల చేయాలని పాకిస్థాన్ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ఒకవేళ అదే జరిగితే.. 9/11 నాటి ముంబయి ఉగ్రదాడుల బాధితులకు న్యాయం జరగడంలో కీలక ముందడుగు పడినట్లవుతుందన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు.

పహల్గాం ఉగ్రదాడి, అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి వివరించేందుకు శశిథరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష కమిటీ.. అమెరికాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం జరిగిన సమావేశంలో బ్రాడ్ షెర్మన్.. పాకిస్థాన్ వైద్యుడి ప్రస్తావన తీసుకొచ్చారు. దీనిపై తాజాగా శశిథరూర్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. " బ్రాడ్ షెర్మన్ డిమాండ్‌ను స్వాగతిస్తున్నాం. బిన్ లాడెన్‌కు పాకిస్థాన్ ఆశ్రయం కల్పించింది. ఆయన ఎక్కడ ఉన్నాడన్న సమాచారాన్ని లీక్ చేశాడన్న కారణంతో ఓ వైద్యుడిని అక్రమంగా అరెస్టు చేసి, చిత్ర హింసలు పెడుతోంది. ఒక వేళ ఆ వ్యక్తే ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే అవార్డులు, రివార్డులు వచ్చేవి." అంటూ పాక్ సైన్యాధ్యక్షుడిగా ఉన్న జనరల్ ఆసిం మునీర్‌కు.. దేశంలో అత్యున్నత సైనిక హోదా కలిగిన 'ఫీల్డ్ మార్షల్'గా పాక్ ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించిన విషయాన్ని పరోక్షంగా దుయ్యబట్టారు.

అఫ్రీదీ పాకిస్థాన్‌కు చెందిన వైద్యుడు. లాడెన్ కుటుంబసభ్యులకు సంబంధించిన డీఎన్ఏ నమూనాలను సేకరించేందుకు సీఐఏ పోలియో టీకా కార్యక్రమాన్ని నిర్వహించడానికి -మిగతా 2లో

## మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 08)

మహిళల అభివృద్ధి కోసం ఎన్డీఏ సర్కార్ చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి గుర్తు చేశారు. మహిళల నేతృత్వంలో సాధించిన విజయాలను ప్రస్తావించారు. కేంద్రంలో వరుసగా మూడోసారి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటై రేపటికి ఏడాది పూర్తి కావొస్తోంది. ఈ నేపథ్యంలోనే 11 ఏళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "విద్యా, క్రీడలు, స్టార్టప్, -మిగతా 2లో

## ఈ నెల 19న ఏపీ కేబినెట్ భేటీ

**19వ తేదీ ఉదయం 11 గంటలకు భేటీ కానున్న కేబినెట్**

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్**

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 08)



ప్రధాని మోదీ ఏపీ పర్యటన, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర కీలక అంశాలపై చర్చ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 19న జరగనుంది. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం మొదటి అంతస్తులో -మిగతా 2లో

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 08)




రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, కాగ్ ఏప్రిల్ సూచీలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధ్యక్షుడు జగన్ శనివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'జీఎస్టీ ప్రవేశపెట్టినప్పటి నుంచీ ఏప్రిల్-25లోనే రాష్ట్రంలో అత్యధికంగా రూ.3,354 కోట్లు వసూలయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. అది అవాస్తవమని కాగ్ లెక్కలు బయటపెడితే.. కేంద్రం సర్దుబాటు కింద రూ.796 కోట్లు తగ్గించడంతో జీఎస్టీ ఆదాయం తగ్గిందని రాష్ట్రప్రభుత్వం మరో ప్రకటన విడుదల చేసింది. వాస్తవానికీ -మిగతా 2లో

## రాజధానిపై కుట్రలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 08)

రాజధాని అమరావతి మహిళలపై కృష్ణంరాజు వ్యాఖ్యలను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఖండించారు. "అమరావతిపై వ్యాఖ్యలతో మహిళలను అవమానించారు. అమరావతిలో విలసిల్లిన బౌద్ధాన్ని అవహేళన చేశారు. ఆ ప్రాంత చారిత్రక, ఆధ్యాత్మిక సంపదను విస్మరించవద్దు. రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన వారిలో 32 శాతం ఎస్సీ, ఎస్టీలు, 14శాతం బీసీలు ఉన్నారు. రాజధానిపై కుట్రలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవు. విశ్లేషకుడి ముసుగులో కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృతమైన కుట్ర ఉంది. ఇలాంటి కుట్రలను ప్రజలు, అధికార యంత్రాంగం లోతుగా విశ్లేషించాలి. రాజధానిని, అక్కడి మహిళలను అవమానించేందుకు కుటిల యత్నం" అని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భద్రతా మండలిలో పాక్ మంకుపట్టు.. సభ్య దేశాల అసంతృప్తి..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 08)

టెర్రరిజానికి చిరునామాగా ఉన్న పాకిస్థాన్ కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి లో ఉగ్రవాద నిరోధక కమిటీకి వైస్ ఛైర్మన్ హోదాను కట్టబెట్టడం విమర్శలకు దారి తీస్తోంది. ఇస్లామాబాద్‌కు తాలిబన్ల ఆంక్షల కమిటీ బాధ్యతలను కూడా అప్పగించడంపై ప్రపంచ దేశాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు భద్రతా మండలి తీసుకున్న ఈ నిర్ణయాన్ని కౌన్సిల్‌లోని మిగిలిన సభ్యులు సైతం వ్యతిరేకిస్తున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జనవరిలో జరగాల్సిన ఐక్యరాజ్య సమితి కమిటీల కేటాయింపు ప్రక్రియ కేవలం పాక్ డిమాండ్లపై ఏకాభిప్రాయం లేకపోవడంతోనే ఐదు నెలలు ఆలస్యమైందని అధికారులు పేర్కొన్నారు.

పాకిస్థాన్ మంకుపట్టు, అహేతుక డిమాండ్లపై మండలిలోని ఇతర సభ్యులు విసిగిపోయారని అధికారులు తెలిపారు. దీంతో ఉగ్రవాదంపై భారత్‌ను లక్ష్యంగా చేసే పాక్ ప్రయత్నాలకు ఇతర సభ్యులు మద్దతు పలికేందుకు సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. యూఎన్ఎస్సీ శాశ్వత సభ్యులు చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, అమెరికా ఏ కమిటీకీ నాయకత్వం వహించడానికి ఇష్టపడలేదని పేర్కొన్నారు. ఎందుకంటే ఆ దేశాలకు హోదాలతో పని లేదని..అవన్నీ ఏకాభిప్రాయంతో పనిచేస్తాయని అధికారులు తెలిపారు. అయితే పాక్‌కు కేటాయించిన స్థానం అంత ముఖ్యమైనది కాదని.. కేవలం నామమాత్రమైందేనన్నారు. కానీ.. తాలిబన్ -మిగతా 2లో

## సాంకేతిక పరిజ్ఞానం చేదోడుగానే ఉండాలి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 08)



తీర్పులను వెలువరించడంలో న్యాయమూర్తులకు సాంకేతిక పరిజ్ఞానం చేదోడువాదోడుగా ఉండాలే తప్ప మానవ మేధ స్థానాన్ని అది భర్తీ చేయరాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. లండన్ విశ్వవిద్యాలయ ప్రాచ్య, ఆఫ్రికా అధ్యయన కేంద్రంలో 'భారత న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞాన పాత్ర' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. వర్చువల్ అసిస్టెంట్లు, డిజిటల్ కియోస్క్‌లు, ఆటోమేటెడ్ కాజ్‌లిస్టులను న్యాయవ్యవస్థ స్వాగతిస్తున్నా, నైతిక విలువలు, మానవ పర్యవేక్షణ, పటిష్ఠ శిక్షణలతోనే ఈ సాంకేతిక సాధనాలు పనిచేయాలన్నారు. న్యాయ ప్రక్రియలో నమ్మకం, పారదర్శకతలను పెంపొందించే విధంగా టెక్నాలజీని వాడాలన్నారు. కేసుల నిర్వహణ, న్యాయపరమైన పరిశోధన, -మిగతా 2లో

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు బ్రిటన్ బాసట

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 08)

ఉగ్రవాదం, దానికి మద్దతుగా ఉండే శక్తులపై అంతర్జాతీయ స్థాయిలో నిర్ణయాత్మక చర్య ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ఉద్ఘాటించారు. శనివారం ఆయన బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లామీ.. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించినట్లు ప్రధాని కార్యాలయం పేర్కొంది. సీమాంతర ఉగ్రవాదంపై భారత్ సాగిస్తున్న పోరుకు మద్దతును ప్రకటించినట్లు తెలిపింది. భారత్-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, డబుల్ కంట్రిబ్యూషన్ కన్వెషన్‌పై చర్చలు ఫలప్రదం కావడంపై మోదీ సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కీలక మైలురాయిని చేరడానికి ఇరు పక్షాలు నిర్మాణాత్మక సంప్రదింపులు జరిపాయని వివరించారు. రెండు దేశాల సంబంధాల్లో వృద్ధిని మోదీ స్వాగతించారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలు, హరిత పరిజ్ఞానం వంటి కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని బ్రిటన్ వాంఛిస్తున్నట్లు లామీ పేర్కొన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల రెండు దేశాలకు కొత్త ఆర్థిక అవకాశాలు లభిస్తాయని ఆయన ధీమా వ్యక్తంచేశారు. ఇద్దరు నేతలు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపైనా మాట్లాడుకున్నారు. -మిగతా 2లో



## మొదటి పేజీ తరువాయి

## పాక్‌లో ఉగ్రవాదాన్ని పోత్సహిస్తే ప్రమోషన్లు..

## లేదంటే బేడీలు: శశిథరూం

ఆయన సాయం చేశారు. ఈ క్రమంలో 2011లో అబొట్టాబాద్ మిలిటరీ కంటోన్మెంట్ శివారులోని ఓ సురక్షిత ప్రాంతంలో ఉన్న లాడెన్‌పై అమెరికా దాడి చేసి హతమార్చింది. ఇదంతా అఫ్రీదీ వల్లనేనని భావించిన పాక్ అధికారులు వెంటనే అఫ్రీదిని అరెస్టు చేశారు. 2012లో అక్కడి కోర్టు ఆయనకు 33 ఏళ్లు జైలు శిక్ష విధించింది. అప్పటి నుంచి అతడు జైల్లోనే ఉంటున్నారు.

## బండారు దత్తాత్రేయ

## 'ప్రజల కథే నా ఆత్మకథ'

ఒడిదొడుకులు, విజయాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. సీనియర్ ప్రజా సేవకుల జీవితానుభవాలను గ్రంథస్థం చేయడం సమాజానికి ఎంతో అవసరమని, వారి కథనాలు మార్గదీపికలుగా ఉపయోగపడతాయని చంద్రబాబు అన్నారు.ఇటీవలే, మే నెలలో ఢిల్లీలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ చేతుల మీదుగా దత్తాత్రేయ ఆత్మకథ హిందీ అనువాదం 'జనతా కీ కహానీ – మేరీ ఆత్మకథ' పేరుతో విడుదలైంది. దత్తాత్రేయ రాజకీయ, సామాజిక సేవను నిజాయితీగా పొందుపరిచిన ఈ పుస్తకం అప్పట్లో ప్రశంసలు అందుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని తెలుగు పాఠకులకు మరింత చేరువయ్యే లక్ష్యంతో నేడు తెలుగు అనువాదాన్ని విడుదల చేశారు. తెలుగు ప్రజలతో గవర్నర్‌కు ఉన్న లోతైన అనుబంధాన్ని ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

తన ఆత్మకథ గురించి గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, ఇది తన సామాన్య జీవితం నుండి అత్యున్నత రాజ్యాంగ పదవుల వరకు సాగిన ప్రయాణానికి హృద్యమైన కథనమని తెలిపారు. తన తల్లి దివంగత ఈశ్వరమ్మ తనకు నేర్పిన సానుభూతి, అంకితభావం, సేవా విలువలే తన జీవితాన్ని, వృత్తిని తీర్చిదిద్దాయని ఆయన గుర్తుచేసుకున్నారు. తన జీవిత కథ యువతను నిబద్ధతతో, వినయంతో ప్రజాసేవ వైపు నడిపించాలని ఆశిస్తున్నట్లు దత్తాత్రేయ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం తెలుగు సాహిత్యం, ప్రజా జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుందని, దక్షిణ భారతదేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులలో ఒకరి వ్యక్తిగత, రాజకీయ ప్రస్థానాన్ని పాఠకులకు అందిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇటీవలి విషాద సంఘటనల బాధితులకు నివాళులు అర్పించిన ప్రముఖులు, క్లిష్ట సమయాల్లో ఐక్యతను, స్థితిస్థాపకతను పెంపొందించడంలో నాయకత్వ పాత్రను నొక్కిచెప్పారు.

## మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం

సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా మన దేశ కీర్తిని పెంచుతున్నారు. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీఏ సర్కార్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. స్వచ్ఛ భారత్ ద్వారా వారి గౌరవాన్ని కాపాడడం నుంచి జన్‌ధన్ ఖాతాలతో వారిని ఆర్థికంగా బలోపేతం చేసేంత వరకు ఎన్నో పథకాలు అమలు చేశాం. పేద మహిళల ఆరోగ్యం దృష్ట్యా 'ఉజ్వల్ యోజన' పథకం కింద గ్యాస్ సిలిండర్లు అందించాం. 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన'తో పేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇచ్చాం. ప్రతి ఆడబిడ్డను రక్షించేందుకు, వారు ఉన్నతంగా ఎదిగేందుకు 'బేటీ బచావో, బేటీ పడావో'ను అమలు చేశాం. పేదలు, రైతులు, యువత కోసం ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని మీరంతా చూశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా 11 ఏళ్లుగా కృషి చేస్తున్నాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు బ్రిటన్ బాసట

'బాధితులతో దుష్టులు సమానం కాదు'

భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. దుష్టులు బాధితులతో సమానం కాదని.. భారత్ ఉగ్రవాదాన్ని ఎన్నటికీ సహించబోదని అన్నారు. బ్రిటన్ విదేశాంగశాఖ మంత్రి డేవిడ్ లామీతో ఆయన దిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన బ్రిటన్ ప్రభుత్వానికి జైశంకర్ ధన్యవాదాలు తెలిపారు. "ఉగ్రవాదాన్ని మేం ఎన్నటికీ సహించబోం. ఉగ్రవాదాన్ని సహించకూడదనే విధానాన్ని భారత్ అనుసరిస్తోంది. చెడుకు పాల్పడే వారిని, దానివల్ల బాధితులయ్యే వారిని సమానంగా చూస్తామంటే మేం ఎన్నటికీ అంగీకరించబోం. అలాగే ఉగ్రవాదాన్ని సహించబోమనే భారత విధానాన్ని మా భాగస్వామ్య దేశాలు అర్థం చేసుకోవాలని ఆశిస్తున్నాం" అని జై శంకర్ అన్నారు. ఈ భేటీ సందర్భంగా ఇరుదేశాల వ్యూహాత్మక ద్వైపాక్షిక సంబంధాలపై, వాణిజ్యపరమైన చర్చలు జరిపినట్లు జాతీయ మీడియా పేర్కొంది. రెండు రోజుల పర్యటన కోసం లామీ శనివారం ఉదయం దిల్లీకి చేరుకున్నారు.

## ఈ నెల 19న ఏపీ కేబినెట్ భేటీ

గల సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరుగుతుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నేపథ్యంలో, 17వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు అన్ని శాఖల కార్యదర్శులు కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించాలని ఆదేశించారు. ఈ నెల 4న జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.కాగా, మంత్రివర్గ సమావేశాలను నెలకు రెండుసార్లు నిర్వహించాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. ఈ క్రమంలో ఈ నెలలో రెండవ సమావేశం 19వ తేదీన నిర్వహించనున్నారు. ఈ నెల 21న విశాఖలో నిర్వహించే ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రానున్నందున, అందుకు ముందుగానే కేబినెట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.ఈ కేబినెట్ సమావేశంలో ప్రధాన మంత్రి ఏపీ పర్యటన, రాష్ట్రంలో పెరుగుతున్న కరోనా కేసులు, త్వరలో అమలు చేయనున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు మొదలైన ముఖ్యమైన అంశాలపై చర్చించనున్నారు.

## సాంకేతిక పరిజ్ఞానం చేదోడుగానే ఉండాలి

కోర్టు పత్రాల అనువాదం, అందుబాటులోని డేటా ఆధారంగా భవిష్యత్తును అంచనా వేయడానికి భారత న్యాయవ్యవస్థ ఇప్పటికే కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగిస్తోందని గవాయ్ వెల్లడించారు. న్యాయస్థానాలలో ఏఐని వినియోగించేటపుడు జాగ్రత్త పాటించాలని ప్రపంచవ్యాప్తంగా తర్జనభర్జన జరుగుతోంది. ఉదాహరణకు లైంగిక నేరాలకు గురైన మహిళ పేరు, వివరాలను బయటపెట్టకూడదనే జాగ్రత్తను ఏఐ పాటించేలా చూడాలని గవాయ్ అన్నారు. తగినంత సమాచారం అందుబాటులో లేకపోయినా ఏవేవో ఊహించి కల్పిత సమాచారాన్ని ఏఐ అందిస్తున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయని ఆయన హెచ్చరించారు. రాజ్యాంగబద్ధంగా, సహానుభూతితో టెక్నాలజీని ఉపయోగిస్తే న్యాయప్రక్రియ మానవీయంగా, సమర్థంగా మారుతుందని వివరించారు. తరవాత సీజేఐ గవాయ్ సింగపూర్ అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం, ట్రైలీగల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో కూడా గవాయ్ ప్రసంగించారు. అన్ని వివాదాలు, ముఖ్యంగా వాణిజ్య వివాదాలు కోర్టుల్లోనే పరిష్కారం కానక్కర్లేదని, మధ్యవర్తిత్వంతో పరిష్కారం సాధించవచ్చని అన్నారు. భారతదేశంలో మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పరచడానికి సుప్రీంకోర్టు నిర్ణయాలు తోడ్పడ్డాయని చెప్పారు.

## భద్రతా మండలిలో పాక్ మంకుపట్టు.. సభ్య దేశాల అసంతృప్తి..

ఆంక్షల కమిటీ పగ్గాలను దక్కించుకోవడం వల్ల ఇస్లామాబాద్, కాబుల్ మధ్య అభిప్రాయభేదాలు తగ్గేందుకు అవకాశం ఉందన్నారు. మొదట భద్రతా మండలిలోని 1267 ఆంక్షల కమిటీ, 1540 (నాన్-ప్రొలిఫరేషన్) ఆంక్షల కమిటీ, 1988 తాలిబాన్ కమిటీ, 1373 ఉగ్రవాద నిరోధక కమిటీ ల అధ్యక్ష పదవులను పాక్ డిమాండ్ చేసింది. అయితే యూఎన్ఎస్‌సీ ఆ దేశానికి తాలిబాన్ కమిటీతో పాటు, ఉగ్రవాద నిరోధక కమిటీకి వైస్ ఛైర్మన్ హోదాలను ఇచ్చింది. పాకిస్థాన్ ఉగ్రవాదానికి అడ్డా అనేది జగమెరిగిన సత్యం. ప్రపంచవ్యాప్తంగా 850 మంది వ్యక్తులను, సంస్థలను ఐరాస భద్రతా మండలి ఉగ్రజాబితాలో చేర్చగా.. అందులో 146 పాకిస్థానీయులే ఉండటం గమనార్హం. 2008 ముంబయి దాడుల సూత్రధారి, లష్కరే తయ్యిబా వ్యవస్థాపకుడు హఫీజ్ మహమ్మద్ సయీద్, జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు మౌలానా మసూద్ అజార్ వంటి ఎంతో మంది కరడుగట్టిన ఉగ్రవాదులు అక్కడ ఆశ్రయం పొందుతున్నారు.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం

సర్దుబాట్లన్నీ పరిగణనలోకి తీసుకున్నాకే నికర జీఎస్టీని లెక్కిస్తారు. ఏప్రిల్-24తో పోలిస్తే ఏప్రిల్-25లో జీఎస్టీ ఆదాయాలు 24.20%కు తగ్గాయి. ఈ విషయాన్ని కప్పిపుచ్చేందుకే రాష్ట్రప్రభుత్వం ఆదాయం పెరిగిందంటూ కుట్రపూరితంగా ఆ ప్రకటన చేసింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్‌లో పన్ను ఆదాయాలు, పన్నేతర ఆదాయాలు తగ్గాయి' అని వివరించారు.

## ఆత్మీయుల సమక్షంలో మార్కాపురం ఎమ్మెల్యే

### కందుల నారాయణరెడ్డి, వసంత లక్ష్మి ల వివాహ వార్షికోత్సవ వేడుకలు









**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 8)**

గత 25 సంవత్సరాలుగా ప్రజా క్షేత్రంలోనే ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటికి పరిష్కార మార్గాలు చూపుతూ ఎన్ని కష్ట, నష్టాలు ఎదురైనా ప్రజల వెంటే ఉంటున్నది ఒకరు. వారి ధర్మపత్నిగా ఎన్ని కష్టాలు ఎదురైనా వారి వెన్నంటి నీడలా ప్రోత్సహిస్తూ ప్రజల కష్టాలు తమ కష్టాలుగా భావిస్తూ ప్రజలను తల్లిగా ఆదరించేదొకరు. వారు మరెవరో కాదు మన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వారి సతీమణి కందుల వసంత లక్ష్మి. ఆదివారం వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి ఆత్మీయులు, సిబ్బంది, కందుల విగ్నేష్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో మార్కాపురంలోని ఎమ్మెల్యే నివాసంలో వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి కందుల నారాయణరెడ్డి దంపతులు ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. అనంతరం అభిమానులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైభవంగా పిఎస్ఆర్ కుమార్తెల ఓణీల వేడుక



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)**

మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి గ్రామం నందు శ్రీ అభయాంజనేయ స్వామి వారి వార్షికోత్సవం, మద్దిపాడు మండల మాజీ తెలుగు యువత అధ్యక్షులు పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్), శిరీష కుమార్తెలైన పోతినేని శ్రీయ, శ్రీజలకు ఓణీల బహూకరణ కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. ఈ వేడుకలకు సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్, కమ్మ సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, ఇతర టీడీపీ నాయకులు, జనసేన నాయకులు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.













షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక
ప్రకాశం



## స్మార్ట్ మీటర్ల పై క్షేత్ర స్థాయి విచారణకు మంత్రి గొట్టిపాటి ఆదేశం

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 8)**

పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు ఇటీవల స్మార్ట్ మీటర్లు అమర్చిన తర్వాత విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తుందనే ఆరోపణల నేపథ్యంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, దీనిపై స్పందించారు. క్షేత్ర స్థాయిలో స్మార్ట్ మీటర్ల పనితీరు ఎలా ఉంది? విద్యుత్ చార్జీలు అధికంగా రావడం వాస్తవమా కాదా అనే విషయాలపై (తరువాయి 4లో...)

# నీకు ఇంత..నాకు అంత..!

- ఉపాధి పనిలో చక్రం తిప్పుతున్న ఇద్దరు రింగ్ మాస్టర్లు
- పేదల చెమట చుక్కలతో పెత్తందారుల దోపిడి
- పనికి పోతే రూ.300, పోకపోతే రూ.600 ?
- యర్రగొండపాలెం ఉపాధి కార్యాలయంలో ఇదీ తంతు
- ఆఫీసులో చల్లగా.. ఉపాధి పనిలో మెల్లగా... నిధులు బొక్కేస్తున్న వైనం
- నాకు కొంత ఇస్తేనే పచ్చ ఇంకు సంతకం
- ఓ అధికారి నిర్వాకంపై విస్తుపోతున్న కూలీలు?




**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జూన్ 8)**

మండేటి ఎండల్లో కొండలు గుట్టలు వాగులు, వంకలు, చెరువులు, చెట్టు పుట్ట తేడా లేకుండా ఆకలి కడుపులు చేతపట్టుకోని ఉపాధి పనులు చేస్తున్న కూలీల చమట చుక్కలను అధికార యంత్రాంగం నీకెంతా నాకెంతా అంటూ దోపిడి చేయడం బహిరంగ రహస్యంగా మారింది. నియోజకవర్గంలో ఉపాధి పనులకు పోతే రూ.300, పోకపోతే రూ.600 అన్నట్టుగా వసూళ్ల పర్వం మొదలైన విషయం అందరికి తెలిసిందే. ఈ విషయంలో నూతనంగా నియమించబడిన కూటమి నాయకుల అనుచర గణం వసూళ్ళ పర్వానికి తెరలేపడంతో ఉపాధి కూలీల సైతం కొన్నిచోట్ల ఎదురు ప్రశ్నల బాణాలు సంధిస్తున్నారు. అంతేగాక నవ్విపోదురు గాక నాకేంటి అన్నట్టు మేటుతో మొదలు పెట్టి కంప్యూటర్ ఆపరేటర్, ఫీల్డ్ అసిస్టెంట్, మండల స్థాయి అధికారుల వరకు ఎవరి వాటాలు వారు పప్పులు, బొరుగుల మాదిరిగా లెక్కలు వేసి మరీ పంచుకోవడం బహిరంగ రహస్యంగా మరింది. నియోజకవర్గంలోని నిరుపేదల వలసలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధి హామీ పథకం అభాసుపాలై అటకెక్కింది. మస్టర్లు కొట్టకముందే ఎర్రటి ఎండలో పనిచేసిన ఉపాధి కూలీలు రూ.300 ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది. మస్టర్లు కొట్టిన తరువాత పనికి పోనివారు సగభాగం అంటే రూ.600 నైవేద్యంగా ఇచ్చుకునే పరిస్థితి నెలకొందనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాదిహామీపథకంలో ఎవరి దోపిడి వారిదే అన్నట్టుగా మారడంతో కొంత నిజ, నిజాలు రాసే పాత్రికేయులను ఆకట్టుకునే ప్రయత్నం కూడా సంబంధిత సిబ్బంది మొదలు పెట్టడం చర్చానీయాంశంగా మారింది. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల్లో జరిగిన ఉపాధిహామీ పనుల్లో ఎక్కువుగా దొంగ మస్టర్లు ఉన్నాయని, మైనర్ తీరని చిన్నారుల పేర్లు కూడా మస్టర్లలో చేర్పించుకోవడం, జరుగుతున్న అవినీతిలో భాగం పంచుకోవడానికి యధేచ్ఛగా కూటమి ప్రభుత్వంలోనే కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు మేట్‌లు ఈ అవినీతిలో భాగస్తులని ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అదే విధంగా గత వైసిపి ప్రభుత్వంలో టిఏ ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా కొనసాగిన పలువురు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కూడా అదే బాధ్యతలు చేపట్టి వసూల్ రాజాలుగా మారారన్న చర్చలు అక్కడక్కడా జరుగుతున్నాయి. మరికొన్ని మండలాల్లో కూలీలకు మస్టర్లు కొట్టాలన్న పనికోసం డిమాండ్ పెట్టాలన్న ముడుపులిస్తేనే లేకుంటే మీ మస్టర్లు ముందుకుపోవు అనే బెదిరింపులతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని ఉపాధి కూలీలు అంటున్నారు. రాజకీయ ముసుగులో మేట్లుగా అవతారాలు ఎత్తి పేదలకు అందాల్సిన ఉపాది పెత్తందారుల చేతిలోకి తీసుకోని నిరుపేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఉపాధి కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ నియోజకవర్గంలో గాడితప్పిన ఉపాధి కార్యాలయ అధికారులు, సిబ్బంది వైఖరిని గాడిలో పెట్టాలని కూలీలు వేడుకుంటున్నారు. మరి కలెక్టర్ ఆ దిశగా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే మరి...!

# వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు ఎక్కువ దిగుబడి

### రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 8)**

నూతన సాంకేతికత, వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా రైతులకు సమయాన్ని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఆదివారం కొండపి నియోజకవర్గం, టంగుటూరు మండలం, సురారెడ్డిపాలెంలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను, 80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోగో డ్రోన్‌ను, సబ్సిడీతో విత్తనాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి డాక్టర్ శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. రూ.100 కోట్లతో రాష్ట్రంలోని రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా లో 3.98 కోట్ల రూపాయలతో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. 2014-19 టీడీపీ హయాంలో 50 శాతం సబ్సిడీతో రైతులకు ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను, 90 శాతం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలను అందచేయడం జరిగిందన్నారు. 1994 - 2000 మధ్య కాలంలోనే నారా చంద్రబాబు నాయుడు కుప్పంలో ఇజ్రాయెల్ టెక్నాలజీతో బిందు సేద్యాన్ని ప్రోత్సహించారన్నారు. రైతు బావుంటేనే దేశం బాగుంటుందన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. నూతన సాంకేతికత, వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా రైతులకు



# మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వసంత లక్ష్మి ల 25వ వార్షికోత్సవం సందర్భంగా పొదిలి పట్టణంలోని వెలుగు కార్యాలయ ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిండు నూరేళ్ళు సుఖ శాంతులతో మీ దంపతులు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షణ్ముఖ వెలుగు దినపత్రికి ఎడిటర్, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్, ప్రజాశక్తి విలేకరి నర్రా వెంకటేశ్వరరెడ్డి, టివి9 వేణు, ఎబిఎన్ ప్రశాంత్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



# నన్ను నమ్మిన కార్యకర్తల కోసం ఎంతవరకైనా వస్తా !

### కార్యకర్తలకు అందుబాటులో ఉంటా ! నా వాళ్ళను కాపాడుకుంటా మాజీ మంత్రి బాలినేని

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)**

నన్ను నమ్ముకున్న కార్యకర్తల కోసం ఎంతవరకైనా వస్తానని, వారికి ఏ కష్టం వచ్చినా అండగా ఉండి ఆదుకుంటానని మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఒంగోలులో పర్యటించారు. తొలుత





# స్మార్ట్ మీటర్ల పై క్షేత్ర స్థాయి విచారణకు మంత్రి గొట్టిపాటి ఆదేశం

సమగ్ర దర్యాప్తుకు మంత్రి ఆదేశించారు. సోమవారం నాటికి సమగ్ర నివేదికను తనకు సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. "స్మార్ట్ మీటర్‌తో బిల్లు ఎక్కువ వస్తున్నాయి అనే విషయం మా దృష్టికి వచ్చింది. దీనికి గల కారణాలను తెలుసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాము. స్మార్ట్ మీటర్ల పని తీరుపై కూడా నిశిత పరిశీలన జరుగుతోంది. ఎవరిపైనా అనవసరంగా ఒక్క రూపాయి భారం మోపేది లేదు" అని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు.

# వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు ఎక్కువ దిగుబడి









సమయాన్ని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందులో భాగంగానే ఈ రోజు సురారెడ్డి పాలెంలో 80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్ ను పంపిణీ చేయడం జరిగిందన్నారు. డ్రోన్ టెక్నాలజీతో రైతులకు అండగా నిలవాలని, వ్యవసాయాన్ని సులువుగా, లాభదాయకంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహించడం జరుగుచున్నదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 800 గ్రామ స్థాయి కిసాన్ సమైక్యలను ఏర్పాటుచేసి రైతులకు డ్రోన్స్ అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గ్రామంలో త్రాగునీటి సమస్య ఉందని, అలాగే రామాలయం నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకురాగా, మంత్రి స్పందిస్తూ 450 కోట్ల రూపాయలతో రామతీర్థం రిజర్వాయర్ నుండి ఈ ప్రాంత గ్రామాలకు త్రాగునీటిని అందించేలా ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఈ లోపు ఫిల్టర్స్ ఏర్పాటు చేసి చెరువు నుంచి సురక్షిత తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. అలాగే రామాలయం నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు పంపడం జరిగిందని మంత్రి తెలపడం జరిగింది. పోలవరం పూర్తి చేసి రాష్టాన్ని సస్యశ్యామలం చేస్తామని, గత ప్రభుత్వం వెలుగొండ పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసి జిల్లా ప్రజలను మోసం చేశారని, కూటమి ప్రభుత్వమే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తుందని మంత్రి తెలిపారు. పొగాకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. హామీల్లో భాగంగా పించన్‌ను పెంచి ప్రతి నెలా ఒకటవ తేదీనే అందచేయడం జరుగుచున్నదని, అలాగే ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, సర్పంచ్ శైలజ, మండల వ్యవసాయ శాఖ అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, రైతు లబ్ధిదారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా ఎస్పీ కుమారుడు, కుమార్తె వస్త్రాలంకరణ వేడుక

### హాజరైన మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలు, అధికారులు











**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)**

జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ కుమారుడు శుశాంత్ చౌదరి, కుమార్తె అమోదిత చౌదరిల వస్త్రాలంకరణ వేడుక ఆదివారం నగరంలోని దక్షిణ బైపాస్ వద్ద ఎస్‌జివిఎస్ కన్వెన్షన్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, పోలీసు శాఖలోని పలు విభాగాల అధికారులు, సిబ్బంది హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. చిన్నారులకు ఆశీర్వచనాలు అందించిన వారిలో రాష్ట్ర సాంఘీక, సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఏపి మారటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, కందుల నారాయణరెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, బిఎన్ విజయ్‌కుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జిలు గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జనసేన రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ రియాజ్, నగర మేయర్ గంగాడ సుజాత, జనసేన నాయకులు కంది రవిశంకర్, ఇతర పార్టీల నాయకులు, జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

# నన్ను నమ్మిన కార్యకర్తల కోసం ఎంతవరకైనా వస్తా !



జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ కుమారుడు, కుమార్తెల వస్త్రాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం కొత్త పట్నం మండలం గమళ్ళపాలెం నాయకులు బలగాని వెంకటనారాయణ. గ్రామ సర్పంచ్ రమణమ్మ కుమారుని వివాహం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా గుమళ్ళపాలెంలోని ఆయన నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకి బాలినేని సమాధానం చెపుతూ తమ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని, అలాగే తన వెంట ఉన్న వాళ్లని కాపాడుకుంటానని తెలిపారు. ఇక పై ఒంగోలులోనే ఎక్కువగా ఉంటానని తెలిపారు. తొలుత ఒంగోలు వచ్చిన బాలినేనికి పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బాలినేని శ్రీనివాసరెడ్డి వారందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.



# మహిళల సమున్నత అభివృద్ధే తెలుగుదేశం పార్టీ లక్ష్యం

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి













(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 8)

మహిళల సమున్నత అభివృద్ధే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం పొదిలి పట్టణంలోని మూడవ సచివాలయ కార్యాలయ ఆవరణలో (వెలుగు ఆఫీస్) పొదిలి, కొనకనమిట్ల మండలాల వెలుగు సిబ్బంది, వీవోఏలు, తెలుగుదేశం నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాజరా మాట్లాడారు. పొదిలి, కొనకనమెట్ల మండలాల్లో దాదాపు 2800 గ్రూపులు ఉన్నాయని, వీటి ద్వారా దాదాపు రూ.50 కోట్ల రుణాలు గ్రూపులకు ఇచ్చారని వెలుగు సిబ్బంది, వివో ఏలు, తెలుగుదేశం నాయకులు సమిష్టిగా కృషిచేసి గ్రూపులను ఒక అభివృద్ధి చేయాలని అన్నారు. కొనకనమిట్ల మండలంలో 3000 ఎకరాలతో 1500 కోట్ల రూపాయలతో రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా ప్రతి సంవత్సరం రైతులకు ఎకరాకు రూ.30 వేలు, అసైన్మెంట్ భూములకు రూ.15 వేలు లబ్ధి చేకూరుతుందన్నారు. నిరుద్యోగ సమస్య కూడా తీరుతుందన్నారు. రిలయన్స్ బయోగ్యాస్ పరిశ్రమను పొదిలి మండలంలో కూడా ఏర్పాటు చేసేందుకు 4000 ఎకరాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించామన్నారు. తద్వారా ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య కూడా తీరుతుందన్నారు. అధికారులు ఆ పనిలో నిమగ్నం అయ్యారని అన్నారు. ఈ సందర్భంగా జగన్ దుష్టపాలన నుండి రాష్ట్రానికి విముక్తి లభించి సంవత్సరం అయిన సందర్భంగా వివోఏలు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అందరికీ ఎమ్మెల్యే స్వయంగా తినిపించారు. ఈ కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల మండల వెలుగు ఏపిఎంలు గోపాలకృష్ణ, సుధాకర్, పొదిలి నగర పంచాయతీ కమిషనర్ కె ఎల్ నారాయణరెడ్డి, పొదిలి మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, ముల్లా ఖుద్దూస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, శివాలయం ప్రతిపాదిత ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, మాజీ శివాలయం ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎం భాష, జిల్లా కార్యదర్శి షేక్ షబ్బీర్, కొనకనమిట్ల మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఏదుబాటి వెంకట నారాయణ చౌదరి, మువ్వ కాటం రాజు, పొదిలి మండల వెలుగు సిసిలు లక్ష్మీరెడ్డి, దాసు, వెంకటరెడ్డి, రాజయ్య, అకౌంటెంట్ శ్రీదేవి, కొనకనమిట్ల సిసి సాయిల్, ఓఎస్ఎఫ్ డిటిఈ వై వి కృష్ణారెడ్డి, విటిసిలు అనిత, లక్ష్మి, బిడిఎస్‌లు, మహిళా నేతలు సోమిశెట్టి శ్రీదేవి, మెహరున్నీసా, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 8)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ లో జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాల్లో, తహసీల్దార్ కార్యాలయాల్లో అర్జీలను ఇవ్వవచ్చని ఆయన తెలిపారు. అర్జీదారులు మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసు కోవచ్చని ఆయన తెలియజేశారు. అలాగే వారి అర్జీల నమోదు, నమోదు చేసిన అర్జీల యొక్క స్థితికి సంబంధించి సమాచారం తెలుసుకోవడానికి 1100 నేరుగా కాల్ చేయవచ్చునని ఆయన తెలిపారు.

# 38 మంది తైక్వాండో విజేతలకు బెల్టులు ప్రదానం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

ఆదివారం కట్టావారిపాలెం గ్రామంలోని హ్యాపీ కిడ్స్ ఉన్నత పాఠశాల నందు మన ఊరి వికాసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తైక్వాండో పరీక్షలు నిర్వహించారు. ఆల్ ఇండియా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు, 8వ డిగ్రీ బ్లాక్ బెల్ట్ ఉన్నం మారుతి ప్రసాదు చీఫ్ ఎక్సామినర్ గా హాజరై విజేతలైన 7 మందికి బ్లూ, 13 మందికి గ్రీన్, 18 మందికి యెల్లో బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఒంగోలు దేవి ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కంకణాల కృష్ణ మోహన్ మాట్లాడుతూ తైక్వాండో విద్య నేర్చుకోవడం వలన యువతకు ఆత్మ విశ్వాసంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని, ముఖ్యంగా ఆడపిల్లలకు ఆపద సమయంలో ఆత్మ రక్షణగా ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ విద్యను దుర్వినియోగం చేయరాదని విద్యార్థులకు సూచించారు. మారుమూల గ్రామాల యువతకు గత పది సంవత్సారల నుండి ఉచితంగా తైక్వాండో శిక్షణ ఇస్తూ రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో బంగారు, వెండి పతాకాలు సాధించి పెట్టిన మారుతి ప్రసాదు, వారి శిష్యులకు అభినందనలు తెలిపారు. స్వర్గీయ ధర్మవరపు వెంకటరత్నం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ప్రసాదు (ఎన్.ఆర్.ఐ), అజయ్ బాబు ఆర్థిక సహాయంతో ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని నిర్వాహకులు తెలియజేశారు. మారుతి ప్రసాదు, డాక్టర్ కృష్ణ మోహన్‌ల నిస్వార్ధ సేవలకు కృతజ్ఞతగా నిర్వాహకులు వారిని శాలువాతో సన్మానించారు. తదనంతరం విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరపు అజయ్, మన ఊరి ఆరోగ్య వికాసం అధ్యక్ష, కార్యదర్శులు కట్టా రవికుమార్, వీరమోసు మస్తానరావు, ఆరోగ్య విస్తరణాధికారి జి నాగేశ్వరరావు, హాపీకిడ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ తైక్వాండో టీచర్స్ శ్రీనివాసరావు, శరవణ, జి శ్రీను, గురుచరణ్, లీలా మైత్రి, ఎస్‌కె సభాని, ప్రభాకర్, విద్యార్థుల తల్లితండ్రులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# బదిలీల కౌన్సిలింగ్‌ను మాన్యువల్‌గా చేపట్టాలి

## ఉపాధ్యాయ సంఘాలు తీర్మానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక అత్యవసర సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఎస్జీటీ సమాన కేడర్ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్లోను మాన్యువల్ గా చేపట్టాలని ఏకగ్రీవంగా అన్ని ఉపాధ్యాయ సంఘాలు తీర్మానించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రేపటి కావ్యచరణ ప్రకటించింది 9వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు అన్ని జిల్లా డీఈఓ కార్యాలయం ఎదుట ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టాలని పదవ తేదీన మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర విద్యాభవన్ ముట్టడి నిర్వహించాలని అదేవిధంగా పై కార్యాచరణతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి వాట్సప్, ఇ-మెయిల్ ద్వారా ఉపాధ్యాయ డిమాండ్లు ను తెలియజేయాలని అన్నారు. సోమవారం ఉదయం ప్రకాశ భవనం ఎదుట 10 గంటలకు ఆమర నిరాహార దీక్ష చేస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఐక్యవేదిక తెలిపింది. కిందిస్థాయి ఉపాధ్యాయులు ఎవరు వెబ్ ఆప్షన్ పెట్టవద్దన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక భరోసా ఇస్తుందని తెలిపారు. ఎంఈఓ, జిల్లా ఉప విద్యాశాఖ అధికారులు గానీ, జిల్లా విద్యాశాఖ అధికారులు అధికారులు కానీ , ఉపాధ్యాయులని ఫోన్లు చేసిన ఎవ్వరు వెబ్ ఆప్షన్ పెట్టకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వాక జనార్దన్ రెడ్డి, బి.శేషారావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు, ఏపీటీఎఫ్ 1938 నాయకులు పీవీ సుబ్బారావు, ఆపస్ నాయకులు దిలీప్ చక్రవర్తి, ఏపీ టిఎఫ్ నాయకులు డి శ్రీనివాసులు, బిటి నాయకులు దేవ సహాయం, యుటిఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఎస్.రవి,కోశాధికారి చిన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట





(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జూన్ 8)

మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గ్రామస్తులు సహకారంతో నూతన దేవస్థానం నిర్మించి, గ్రామోత్సవం నిర్వహించి ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామస్తుల సహకారంతో మూడురోజుల నుంచి అన్నదానం కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు.

# కృష్ణం రాజు వ్యాఖ్యలు ఆక్షేపణీయం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

కృష్ణం రాజు వ్యాఖ్యలు ఆక్షేపణీయమని, సదరు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని నరసం ( నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) ఆధ్వర్యంలో ఒంగోలులో నరసం కార్యాలయంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షతన జరిగిన రచయిత్రుల సమావేశంలో పాల్గొన్న రచయిత్రులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ వ్యాఖ్యానాల్లో సంస్కారం ఉందా అతను అనలిస్ట్ ఎలావుతాడు? అని ప్రశ్నించారు. అమరావతిలో ఉన్నది దేవతలు అన్న మాట మీ కిష్టం లేకపోతే మామూలు స్త్రీలుగా గౌరవింప దగిన మహిళా శక్తిగా భావించాలి...వీళ్ళందరూ వేశ్యలు అనే హక్కు మీకెవ రిచ్చారు? అమరావతి పై విషం కక్కే దానిలో భాగమే ఈ అనుచిత వ్యాఖ్యలు. ఈ వ్యాఖ్యలను నరసం నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం తీవ్రంగా పరిగణిస్తూ ఖండిస్తుందన్నారు. ఈ రాష్ట్రంలో ఎక్కడ ఆయనకి వేశ్యలే కనపడలేదా ఒక్క అమరావతి లోనే కనపడ్డారా అయినా వేశ్యలు అనే మాటలు వాడి వారిని కూడా అవమానించాల్సిన అవసరం ఏంటి?వేసాలు అని అవమానించాల్సిన అవసరం ఏంటి?.. భూమి గురించి సర్వం త్యాగం చేసి ఐదేళ్ల నరకం అనుభవించిన అమరావతి మహిళలు నిజంగా దేవతలే.వాళ్ళు పోరాట యోధులే... అటువంటి వారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని మహిళలకు క్షమాపణ చెప్పాలని నరసం హెచ్చరిస్తున్నది మహిళా కమిషన్ దీన్ని సుమోటోగా తీసుకొని అతనిపై చర్యలు తీసుకోవాలని నరసం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, ప్రకాశం జిల్లా నరసం ఉపాధ్యక్షురాలు మారేపల్లి సూర్య కుమారి నరసం రాష్ట్రకోశాధికారి బీరం అరుణ తదితరులు పాల్గొన్నారు.

# నేడు యోగాంధ్ర కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 8)

యోగా ఆంధ్ర కార్యక్రమం బాపట్ల భావన్నా రాయణ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 6:30 నుంచి 7:30 గంటల వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం భావనారాయణ స్వామి దేవాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. మానవహారం జరుగుతుందని ఆయన తెలిపారు. యోగ ఆంధ్ర కార్యక్రమానికి జిల్లా అధికారులు, సిబ్బంది, పుర ప్రజలు తప్పక హాజరుకావాలని ఆయన తెలిపారు.

# ఎస్పీ ఏ ఆర్ దామోదర్ కుమారుడు, కుమార్తెల నూతన వస్త్రాలంకరణ వేడుకలో ఎమ్మెల్యే ఇంటూరి



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 8)

ఒంగోలులో దక్షిణ బైపాస్ వద్ద ఎస్‌జివిఎస్ కన్వెన్షన్‌లో ఆదివారం ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ కుమారుడు, కుమార్తెలకు వస్త్రాల బహూకరణ మహోత్సవ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఈ వేడుకలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

# ఎస్‌జీటీ, ఎల్‌పీ, పీఈటీలకు బదిలీలలో మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి

## ప్రకాశం జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఎస్‌జీటీ, ఎల్‌పీ, పీఈటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని పిలుపు మేరకు ఈ నెల 8వ తేదీన ప్రకాశం జిల్లా డీఈవో కార్యాలయం ముట్టడి కార్యక్రమం ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు వాకా జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు చెన్నుపాటి మంజుల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఉపాధ్యాయులను గత నెల నుంచి బదిలీలు, ప్రమోషన్ తో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు వేసవి సెలవులను వినియోగించుకోలేక పోయారని, అందరికీ ఎర్న్ లీవ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఇచ్చిన హామీ మేరకు ఎస్‌జీటీ తదితర ఉపాధ్యాయులకు మ్యాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, సీనియార్టీ లిస్టులలో ఉన్న లోపాలను సరిచేసి సక్రమమైన లిస్టును ప్రకటించాలని, అవసరమైతే సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. రాష్ట్ర యుటిఎఫ్ గౌరవాధ్యక్షుడు కొమ్మోజి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించే వరకు ఉపాధ్యాయులు ఎవరూ వెబ్ ఆప్షన్ పెట్టవద్దని, అందరూ సమైక్యంగా ఉద్యమాల్లో పాల్గొనాలని, ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని, ప్రభుత్వ మండివైఖరి నశించాలని తెలిపారు. ఎస్టీయు రాష్ట్ర బాధ్యులు చల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ మేలు కలిగిస్తుందని, వెబ్ కౌన్సిలింగ్ చాలా ఇబ్బందిగా ఉంటుందని తెలియజేశారు. ఏపీయుఎస్ రాష్ట్ర బాధ్యులు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేష్ వెంటనే రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి మాట్లాడుతూ ఉద్యమాలు బలంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఉపాధ్యాయులు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. బీటీఏ రాష్ట్ర బాధ్యులు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, ఉపాధ్యాయులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా వివిధ సంఘాల బాధ్యులు ఎస్‌కే అబ్దుల్ హై, వీరాంజనేయులు, రవి(యుటీఎఫ్), కె.ఎర్రయ్య(ఎస్‌టీయు), బి.వెంకట్రావు, లక్ష్మీనారాయణ (ఏపీటీఎఫ్ 1938), డి శ్రీనివాసులు (ఏపీటీఎఫ్ 257), దిలీప్ కుమార్ (ఏపీయుఎస్), మాధవరావు (బీటీఏ) వై. వెంకట్రావు (హెచ్‌ఎంఏ), హిమజ (ఏపీయుఎస్) పులి శ్రీను, ఎన్ అంజిరెడ్డి (పీఆర్‌టీయు) తదితరులు పాల్గొన్నారు. ఈ ముట్టడి కార్యక్రమం జిల్లా నలుమూల నుంచి సుమారు 1000 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ప్రకాశం జిల్లా డీఈవో ఓ కిరణ్ కుమార్‌కి వినతి పత్రం ఇచ్చారు.





# యోగతో శ్వాస, శక్తి, ప్రశాంతత

## ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 8)

యోగాతో శ్వాస శక్తి సంపూర్ణ ప్రశాంతత కలుగుతుందని కనిగిరి ఆర్డిఓ కేశవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కనిగిరి యోగ కేంద్రలో అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి యోగ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో కేశ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శ్వాస ప్రశాంతత శక్తి ప్రతి ఒక్కరికి అవసరమని యోగ చేస్తే శ్వాస శక్తి ప్రశాంతత పెరుగుతుందని ప్రతి ఒక్కరు యోగ చేయాలన్నారు. ఒత్తిడి నుంచి విముక్తి పొందాలంటే యోగా ఎంతో ఉపయోగపడుతుందని ప్రతిరోజు యోగా చేసుకోవాలని ఆయన తెలిపారు. కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ యోగ చేయడం ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపుతుందని సంపూర్ణ ఆరోగ్య వంతులుగా జీవించవచ్చని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు చిన్నప్పటి నుంచే యోగభ్యాసాన్ని అలవాటుగా మార్చుకుని, నిరంతరం సాధన చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుత జీవన విధానంలో నిత్యం అధిక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నామని, దీని ద్వారా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి తరుణంలో యోగ పరిష్కారమని యోగ వల్ల నూతన ఉత్తేజం ఉత్సాహంగా పనిచేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు యోగా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి కమిషనర్ డానియల్ జోసఫ్, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు యోగా కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద వృద్ధులకు యోగా కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది వృద్ధులు ఎంతో ఉల్లాసంగా యోగాసనాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధులు,సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి అర్చన, మున్సిపల్ అధికారులు, వయోవృద్ధుల వెల్ఫేర్ ఆసోసియేషన్ అధ్యక్షుడు జే వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సరికొండ అప్పలరాజు, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసరావు, ఇతర సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.








# 12న ఇంజినీరింగ్, మెడికల్ మాక్ వెబ్ కౌన్సెలింగ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

వెబ్ కౌన్సెలింగ్‌కి హాజరు కానున్న ఇంజినీరింగ్, మెడికల్ స్టూడెంట్స్ కోసం ఒంగోలు బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 12వ తేదీ గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒంగోలు పట్టణంలోని గుంటూరు రోడ్డులోని ఏ1 ఫంక్షన్ హాల్లో ప్రత్యేక మాక్ వెబ్ కౌన్సెలింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు బ్రిలియంట్ సంస్థల అధినేత డాక్టర్ న్యామతుల్లా భాష అదివారం బ్రిలియంట్ సంస్థ లో జరిగిన విలేకరుల సమావేశం లో తెలిపారు. భారీ ఎత్తున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి , జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత , దామాచర్ల సత్య , రిటైర్డ్ డి.జి.పి. కె.ఆర్.ఎం. కిషోర్ కుమార్, ప్రముఖ యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజ్ లు, డిగ్రీ కాలేజ్ లు హెూటల్ మేనేజ్మెంట్ కాలేజీలు, మొదలగు నుంచి వైస్ ఛాన్సులర్స్, ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్స్, ఛైర్మన్ లు పాల్గొని స్టూడెంట్స్ కెరీర్ గైడెన్స్ కి అవసరమైన అమూల్యమైన విషయాలపై అవగాహన కల్గిస్తారని తెలిపారు. దేశంలోనే పేరొన్న ఇంజనీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలు తమ విద్యా సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని, వాటి ద్వారా స్టూడెంట్స్‌కి కావాల్సిన సమాచారాన్ని అందిస్తారని తెలిపారు. సదస్సుకు హాజరు అయ్యే స్టూడెంట్స్‌కి ఉచిత భోజనంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం జరుగుతున్న సదస్సులో మరొక ప్రత్యేకత ఏమిటంటే స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా వారు సబ్సిడీ కూడిన ఎడ్యుకేషన్ లోన్స్ మంజూరు చేయుటకు అవకాశం కల్పిస్తున్నారు. సదస్సులో దీనికి సంబంధించిన వివరాలు బ్యాంకు అధికారులు తెలియచేస్తారని న్యాయమత్ తెలిపారు. గత 21 సంవత్సరాలుగా ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని, వేలాది మంది స్టూడెంట్స్ ఈ సదవకాశం వినియోగించుకొని ఉన్నత చదువులు చదువుతూ రాణిస్తున్నారని ఈ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులకు లక్కీ డ్రా ద్వారా ఇద్దరికి ల్యాప్ ట్యాప్ ఇవ్వబడుతుందన్నారు. ల్యాప్ టాప్ లక్కీ డిప్ కూపన్ ల కోసం, ఉచిత బస్ పాస్ మరియు ఇతర వివరముల కోసం ఒంగోలు అంజయ్య రోడ్డులోని బ్రిలియంట్ ఇనిస్టిట్యూట్ నందు సంప్రదించాలని తెలిపారు. ప్రవేశం ఉచితం అని తెలిపారు. ఈ విలేకరులు సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తహూర, కోర్స్ కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆకీల్, ఈవెంట్ మేనేజర్ నాగార్జున పాల్గొన్నారు.




# ప్రత్యేక పూజలలో పాల్గొన్న దామచర్ల సత్య



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 8)

జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు గ్రామంలో నాగర్పమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమంలో రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించి వేద ఆశీర్వచనాలు వేద పండితుల నుంచి స్వీకరించారు.



# దివ్యాంగులకు ట్రై సైకిల్లు పంపిణీ చేసిన ఇంచార్జి దద్దాల

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 8)

కనిగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పెద్ద అమ్మాయి"దద్దాల సాయి ప్రణవి"పుట్టినరోజు సందర్భంగా కనిగిరి మండలం ఎరువారిపల్లి, దిరిశవంచకు చెందిన కేశవరపు దేవమ్మ, గారపాటి సురేఖ, హనుమంతునిపాడుకి చెందిన ఇండ్ల రమేష్ ,వెలిగండ్ల మండలం పందువ నాగులవరంకు చెందిన కందుల లక్ష్మీ నారాయణరెడ్డి, పామూరు మండలం అయ్యవారిపల్లి, మోపాడు గంగానగర్ చెందిన కుర్రా శ్రీనివాసులు, యరసింగ్ మనోజ్ అను ఆరు మంది దివ్యాంగులకు' దద్దాల చారిటబుల్ ట్రస్ట్' ద్వారా ట్రై సైకిల్లు పంపిణీ చేసి మానవత్వం చాటుకున్నారు ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్. ఈ సందర్భంగా కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ దివ్యాంగులను ఎవరు కూడా చిన్నచూపు చూడకూడదని, వారికి కూడా దేవుడు జీవితంలో సవాళ్ళను ఎదుర్కొనే శక్తిని కలిగించాడని, ఇతరులను ప్రేమించినట్లే వారిని కూడా ప్రేమించాలని అటువంటి వారిని ఎటువంటి పరిస్థితుల్లో కించపరచకూడదని, తమతో సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్, గాయం బలరామిరెడ్డి,మడతల కస్తూరి రెడ్డి, యక్కంటి శ్రీనివాసుల రెడ్డి, షేక్ జిలాని భాష,తమ్మినేని సుజాత, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, పులి శ్రీనివాసుల రెడ్డి, రాచపూడిమాణిక్యరావు ,నక్క రామకృష్ణ, గుంటూరి వెంకటేశ్వర్లు చౌదరి,ఎర్రబెల్లి దేవరాజు, షేక్ జాస్మిన్ షఫీ ఆజాద్, నాగమణి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, ముల్లంగి శ్రీహరి రెడ్డి, దమ్ము వెంకటయ్య, నాగూర్ బీ, షకీలా, సుస్మిత, బత్తుల మాలి, గొబ్బిళ్ళ శ్రీను, దేవిరెడ్డి వెంకటస్వామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# యోగాభ్యాసంతో ఆరోగ్య జీవన విధానం సొంతం

## జాయింట్ కలెక్టర్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)**

భారతీయ వారసత్వ సంపద యోగాభ్యాసంతో మానసిక వికాసం, ఆరోగ్య జీవన విధానం సొంతమవుతుందని జాయింట్ కలెక్టర్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కొత్తపట్నం మండలంలోని కొత్తపట్నం బీచ్‌లో యోగాంధ్ర - 2025లో భాగంగా ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల క్రిష్ణ జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య ఆంధ్ర సాకారం దిశగా వడివడిగా అడుగులేస్తూ ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకుంటోందన్నారు. భారతీయ వారసత్వ సంపద అయిన యోగ విశిష్టతను గుర్తించి ఐక్యరాజ్య సమితి 2014న జూన్ 21 న అంతర్జాతీయ యోగ దినోత్సవంగా ప్రకటించగా, అప్పటి నుంచి 10 అంతర్జాతీయ యోగ దినోత్సవాలను జరుపుకున్నామన్నారు. ఈ ఏడాది జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైజాగ్‌లో జరిగే యోగ కార్యక్రమంలో గౌరవ ప్రధాన మంత్రి పాల్గొననున్న నేపథ్యంలో యోగ దినోత్సవ రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు నివ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగానే గత నెల 21వ తేదీ నుంచి నెల రోజుల పాటు యోగాంధ్ర క్యాంపెయిన్ ను రాష్ట వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యోగ శిక్షణ కార్యక్రమాలు, కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో కూడా యోగ రోడ్డును ఏర్పాటు చేసి ప్రతి రోజూ యోగ సాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వర్గాన్ని యోగాంధ్రలో భాగంచేసే లక్ష్యంతోనే థీమ్ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లాలో ఇప్పటికే మల్లవరం, త్రిపురాంతకం పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ రోజున సుమారు రెండు వేల మందితో కొత్తపట్నం బీచ్ నందు యోగ కార్యక్రమాన్ని జరుపుకోవడం జరుగుచున్నదన్నారు. ఈ నెల 15న ఆదివారం సింగరాయకొండ మండలం, పాకల బీచ్ లో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. 20వ తేదీన సుమారు పది వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రత్యేక యోగ కార్యక్రమాన్ని జరుపుకోనున్నట్లు తెలిపారు.సీజిల్లాలో కనీసం పది లక్షల మందిని యోగాసనాల కార్యక్రమంలో భాగస్వాములు చేసే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక యోగా ట్రైనర్లతో పెద్దఎత్తున యోగాసనాల శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తన దైనందిన జీవితంలో యోగ ను భాగంగా చేసుకుని 45 నిమిషాల పాటు యోగాను రోజూ ఆచరించినట్లైతే జీవితాంతం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండొచ్చున్నారు. ప్రతి రోజూ యోగ సాధన వలన హెల్త్ ఇండికేటర్స్‌కు పెంపొందిపబడుతాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, డిపిఓ వెంకట నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, పశుసంవర్ధక శాఖ డి డి రవి కుమార్, బిసి కార్పోరేషన్ ఈడి వెంకటేశ్వర రావు, సెట్నల్ సీఈఓ శ్రీమన్నారాయణ, తహసీల్దార్ మధుసూదన్‌రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలకు అండగా జగనన్న పోరుబాట

## యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ రావు



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జూన్ 8)**

రైతన్నకు అండగా పొదిలి పట్టణం నందు పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పొదిలి వస్తున్న సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మండల పార్టీ కమిటీ నాయకులు, అనుబంధ విభాగల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపిటిసిలు, సొసైటీ చైర్మన్లు, ఎంపిపిలు, జడ్పీటీసీలు, రాష్ట్ర స్థాయి పార్టీ పదవి నాయకులు, మండల అధ్యక్షులు, ప్రతి వైసిపి కుటుంబ సభ్యులు రైతన్నలకు అండగా జగనన్న పోరుబాట విజయవంతం చేయాల్సిందిగా యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు.

# దివంగత నేత ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునః ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి









**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 8)**

నెల్లూరు రామలింగాపురం సర్కిల్‌లో దివంగత నేత ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునః ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామ నారాయణ రెడ్డి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సహచర ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటమి ఎరుగని రాజకీయ దురంధరుడు నిరంతరం ప్రజల కోసం పనిచేసిన నాయకుడు ఆనం వెంకట రెడ్డి అని నెల్లూరు జిల్లా రాజకీయాల్లో, అభివృద్ధిలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారని రాష్ట్ర హోం మంత్రిగా, జల వనరుల శాఖ మంత్రిగా వెంకటరెడ్డి సేవలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు కొనియాడారు.

# కళ్యాణ వైభోగమే!!

# శ్రీగిరిలో వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

## వేడుకగా శ్రీవారి తిరు వీధి ఉత్సవం
## కోలాట ప్రదర్శనతో ఆకట్టుకున్న వాసవీ కోలాట భజన మండలి
## ముగిసిన శ్రీగిరి బ్రహ్మోత్సవాలు











**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామా చార్యులు బృందం మరియు శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా కమనీయంగా రమణీయంగా నేత్రపర్వంగా నిర్వహించారు, దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీవారి తిరు వీధి ఉత్సవం శోభాయ మానంగా నిర్వహించారు. టిటిడి దాస సాహిత్య ప్రాజెక్ట్ వాసవీ భజన మండలి కళాకారులు కోలాట ప్రదర్శనతో భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి కార్య నిర్వహణ ధర్మకర్త సీ వి రామకృష్ణారావు ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు ఆలూరు లక్ష్మీ కుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్, రాజీవ్, ఆలూరు జై శంకర్, తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ నెల 4వ తేదీన అంకురార్పణతో త్రయాహ్నిక దీక్షతో ప్రారంభమైన శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఆదివారం రాత్రితో వైభవంగా ముగిసాయి.

# సాక్షి ప్రతినిధులను శిక్షించాలి

## టీడీపీ నేతలు












(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 8)

ఇటీవల సాక్షి ఛానల్లో అమరావతి మహిళా రైతులను కించపరిచే విధంగా రాజధాని మహిళలను వేశ్యలని మాట్లాడిన సాక్షి ప్రతినిధులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను వెంటనే శిక్షించాలని మార్కాపురం నియోజకవర్గ తెలుగు మహిళలు కోరారు. పొదిలి పట్టణంలో ఆదివారం సాయంత్రం మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక హౌసింగ్ కార్యాలయం నుంచి పొదిలి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి ప్రతినిధులను అరెస్టు చేయాలంటూ నినదించారు. ఆంధ్ర రాజధాని అయిన అమరావతికి తమ సొంత భూమి ఇచ్చి ఆస్తులు కోల్పోయిన మహిళలను ఆ విధంగా మాట్లాడటం అత్యంత సిగ్గుచేటని అన్నారు. అనంతరం రోడ్డు పై సాక్షి దినపత్రిక ప్రతులను చించివేశారు. తదుపరి పొదిలి పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, మహిళా నేతలు సోమిశెట్టి శ్రీదేవి, షహనాజ్, మెహరున్నీసా, పొదిలి మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, ముల్లా ఖుద్దూస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, శివాలయం ప్రతిపాదిత ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, మాజీ శివాలయం ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎం భాష, జిల్లా కార్యదర్శి షేక్ షబ్బీర్, ఇతర మహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యతో ఉన్నత స్థానాలు అందుకోగలం

## ఐఆర్ఎస్ అధికారి గోసు రమేష్












షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

విద్య ద్వారానే ఉన్నతమైన స్థానాలను అందుకోగలమని ఐఆర్ఎస్ అధికారి గోసు రమేష్ అన్నారు. జై బిసి సమితి ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభా పురస్కార కార్యక్రమం నగరంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఆర్ఎస్ అధికారి గోసు రమేష్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని చదువుకు న్నప్పుడే తమ స్థాయిని పెంచుకోగలరని, ఉన్నత స్థానాలకు ఎదగగలరని అన్నారు. పదవ తరగతి లోనే విద్యార్థులకు భవిష్యత్తు నిర్ణయించే దశని అందుకోసం పదవ తరగతిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించి వారిని ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఉద్దేశంతో జై శ్రీ కృష్ణ బీసీ సమితి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు నిరంతరం చదువు తోపాటుగా ఒక మనిషితో సంభాషించిన సమయంలో కూడా అవి చాలా ఉపయోగపడతాయని అన్నారు. ఉన్నతమైన స్థానాల కోసం లక్ష్యాలు ఎంచుకునేందుకు పేద , ధనిక తేడా లేదని పేదవారు కచ్చితంగా లైబ్రరీని ఎంచుకుని, అకౌంట్ పుస్తకాలను చదువుకొని మంచి ర్యాంకులు సాధించిన వారు చాలామంది ఉన్నారని, అందుకోసం ఆ దిశగా మీరు ఆలోచించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల వారి విద్య పట్ల జాగ్రత్తగా ఉన్నతమైన విద్యను అభ్యసించే విధంగా తయారు చేయాల్సిన అవసరం ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ విశాఖ టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ రోహిణి,జై కృష్ణ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, ద్రావిడ కృష్ణారావు, మోరి పిచ్చియ్య, జవహర్ భారతి కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాల్యాద్రి, బంక చిరంజీవి, ప్రసాద్, ఆడక స్వాములు, మీసాల శ్రీనివాసరావు, నాగం వెంగయ్య (చంటి) పాల్గొన్నారు. సభ అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించారు.







## బొక్కిసం ఉపేంద్ర చౌదరి మృతితో విషాదఛాయలు







(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 8)

కొండపి మండల మాజీ వైసీపీ కన్వీనర్ కొండపి పిడిసిసి బ్యాంక్ మాజీ సొసైటీ అధ్యక్షుడు బొక్కిసం ఉపేంద్ర చౌదరి ఆకస్మిక మృతితో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉపేంద్ర చౌదరి భౌతిక గాయానికి మాజీ మంత్రి ఆది మూలపు సురేష్, కొండపి నియోజకవర్గ మాజీ వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ వెంకయ్య పూల మాలలు వేసి, భౌతిక గాయానికి నివాళులర్పించారు. ఉపేంద్ర చౌదరి అంతిమ యాత్రలు నియోజకవర్గం వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 8)

జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రధాన ఉత్సవం ఈ నెల 9వ తేదీ జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమం ఈనెల 9వ తేదీ సోమవారం మధ్యాహ్నం 1:30 గంటలకు సాయిరాం గార్డెన్ కన్వెన్షన్ హాల్లో జరుగుతుందని ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు హాజరు అవుతారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలు, కళాశాల విద్యార్థిని విద్యార్థులకు నగదు పారితోషికం, అవార్డులు ప్రధానోత్సవం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## నేడు ఆకుపాటి ఆధ్వర్యంలో మహా అన్నదానం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 8)

పామూరు పట్టణం నందు మదన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమాల సందర్భంగా పామూరు పట్టణ ఎంపిటిసి సభ్యులు ఆకుపాటి వెంకటేష్ వారి కుటుంబ సభ్యులు అందరూ కలిసి సోమవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపిటిసి ఆకుపాటి తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com